క్లుప్తంగా

రైతుల సమస్యలు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

కాల్వశ్రీరాంపూర్: రైతులు, ప్రజలు తమ సమస్యలపై కార్యాలయానికి వచ్చినప్పుడు సత్వరమే పరిష్కరించాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. భూసమస్యలను పెండింగ్‌లో పెట్టొద్దని, అవసరమైతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దరఖాస్తుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. తహసీల్దార్ ఎండీ వకీల్, డీటీ శంకర్, ఆర్ఐ రాజేందర్, ఎండీ అజీమ్, కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

స్వచ్ఛ మంథనిగా తీర్చిదిద్దుతాం



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రమ

మంథని: మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ శుక్రవారం ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో మంథని మున్సిపాలిటీ అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. స్వచ్ఛ మంథనిగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టినట్లు తెలిపారు. వరల్డ్ టూరిజం డే సందర్భంగా స్వచ్ఛతాహీ సేవా క్లీనింగ్‌లో భాగంగా మంథనిలోని మహాలక్ష్మి ఆలయం సమీపంలోని రావుల చెరువును పరిశుభ్రం చేశారు. ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మనోహర్, మున్సిపల్ కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, చొప్పకట్ల హనుమంతు, వీకే, రవి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీవో సుదర్శన్

సాక్షి ఎఫెక్ట్..

పాలకుర్తి: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పాలకుర్తి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలను శుక్రవారం మండల అధికారులు తొలగించారు. 24న 'సాక్షి'లో ప్రచురితమైన 'వీధి దీపాలు లేక ఇక్కట్లు' అనే శీర్షికకు మండల పరిషత్ అధికారులు స్పందించారు. రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను కూలీల సాయంతో తొలగించారు. మండల పంచాయతీ అధికారి సుదర్శన్ పనులను పర్యవేక్షించారు. వీధిదీపాల ఏర్పాటుకు స్థానిక కేశోరాం సిమెంట్ కర్మాగారం అధికారులతో చర్చించగా సానుకూలంగా స్పందించారని, త్వరలోనే వీధిదీపాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మ నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వీరబుచ్చయ్య ఆదేశించారు. పన్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ లైట్లు, శానిటేషన్ పనులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రోడ్లు, బతుకమ్మ ఘాట్ల వద్ద ఇబ్బందులు పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బందికి సరుకులు పంపిణీ చేశారు. డీఎల్‌పీవో సతీశ్‌కుమార్, ఎంపీడీవో శైలజారాణి, తహసీల్దార్ రాంచందర్ రావు, ఎంపీవో ఉమేశ్ పాల్గొన్నారు.

మహాధర్నాలో పాల్గొనండి

యైటింక్లయిన్‌కాలనీ: 30న చేపట్టనున్న మహాధర్నాలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ పిలుపునిచ్చారు. ఆర్జీ–2ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–3లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న అధికారులు



రామగిరి: ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో..



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న నగర మేయర్



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న జీఎం లలిత్‌కుమార్



రామగుండం: అంతర్గాం జంక్షన్‌లో..



మంథని: నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

గోదావరిఖని/రామగిరి/మంథని/కోల్‌సిటీ/పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ/కాల్వశ్రీరాంపూర్/రామగుండం/ఎలిగేడు/ధర్మారం/జూలపల్లి/గోదావరిఖనిటౌన్: స్వాతంత్య్ర సమరయోధులు, తొలితరం ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కొండాలక్ష్మణ్ అనుసరించిన విధానాలు, ఆయనకున్న ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.

రుణమాఫీపై మాట తప్పం.. మడమ తిప్పం

జూలపల్లి: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ అమలుపై మాట తప్పేది లేదు, మడమ తిప్పేది లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు కొంజెర్ల వెంకటయ్య అధ్యక్షతన శుక్రవారం జూలపల్లిలోని ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మూడు విడతల్లో మాఫీ చేయగా, రూ.రెండు లక్షల రుణమాఫీ నెలరోజుల్లో పూర్తవుతుందన్నారు. సన్నవడ్లకు ఈ పంట నుంచే 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరలోనే రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

వంతెన, డబుల్‌రోడ్డుకు త్వరలోనే భూమిపూజ..

మండల కేంద్రంలోని హుస్సేన్‌మియా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు, జూలపల్లి–కాచాపూర్ డబుల్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. జిల్లా సహకార అధికారి రామ్మోహన్,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఏవో ప్రత్యూష, సంఘం ఉపాధ్యక్షుడు ముత్తు లింగం, దూళికట్ట విండో అధ్యక్షుడు వేణుగోపాలరావు, సీఈవో సురేశ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మగుడి నిర్మాణానికి కృషిచేస్తా

ఓదెల: రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు శుక్రవారం శివపల్లిలో ఎమ్మెల్యేను కలిశారు. తమ ఆరాధ్య దైవమైన రేణుకఎల్లమ్మగుడి ప్రహరీ పూర్తి చేయాలని గౌడసంఘం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరి రవిగౌడ్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి, గౌడసంఘం నాయకులు మార్క శ్రీనివాస్, సారయ్య, చేరాలు, తిరుపతి, నారాయణ ఉన్నారు.

పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

సుల్తానాబాద్: పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పూసాల రోడ్డులోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి ఐల రమేశ్, ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్, ముఖ్య సలహాదారు చీకట్ల మొండయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు యాదగిరి, మండల అధ్యక్షుడు గుండా మురళి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులతో టీచర్లు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కవిత తెలిపారు. హెచ్ఎంతో పాటు, ఫిజికల్ డైరెక్టర్ ఆసియాబేగం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



కాల్వశ్రీరాంపూర్: అభినందిస్తున్న టీచర్లు

వెన్నంపల్లి విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జోనల్ స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో మండలంలోని వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంఈవో మహేశ్, హెచ్ఎం రాజశేఖర్, పీఈటీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జీడీకే-5 ఓసీపీ పిట్ సెక్రటరీగా గోపి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 పిట్ సెక్రటరీగా అడ్డగట్ల గోపిని ఎన్నుకున్నారు. నూతన కమిటీని గురువారం ప్రాజెక్టు మేనేజర్ అనిల్‌గబాలేకు పరిచయం చేశారు. అసిస్టెంట్ పిట్ కార్యదర్శి పెండ్రు వెంకట్‌రెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణను ఎంపిక చేశారు. వీరితో షిఫ్టులవారీగా పరిచయం చేశారు. యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: ఓసీపీల్లోని ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీరావు డిమాండ్ చేశారు. ఓసీపీ–3 కృషిభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి కల్పించాలని, అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయితే వర్క్‌షాప్‌లో అదే డిజిగ్నేషన్‌లో కొనసాగించాలని, ఎన్‌వన్ ఎత్తివేసి పాత పద్ధతిలోనే స్లేడేలు, మెరుగైన ఇన్సెంటివ్ చెల్లించాలని ఆయన కోరారు. నాయకులు జిగురు రవీందర్, రాంచందర్, రాజయ్య, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కు అందజేత

గోదావరిఖని: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కును ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ శుక్రవారం అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్ ముదాం సత్యనారాయణ కుమారుడు రాహుల్‌కు సంబంధించిన రూ.3.35లక్షల విలువ గల చెక్కును జీఎం అందజేశారు. యూనియన్ నాయకులు రవీందర్, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• భగీరథ నీటిని ఉపయోగించుకోవాలి

ఓదెల: ప్రభుత్వం గ్రామాల్లోకి ఇంటింటా సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ మంచినీటిని ఉపయోగించుకోవాలని మిషన్ భగీరథ పెద్దపల్లి డిప్యూటీ ఈఈ గ్రిడ్ అనిల్ పేర్కొన్నారు. ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంపు ఆపరేటర్లకు మూడురోజుల శిక్షణ ఉంటుందన్నారు. ఎంపీడీవో తిరుపతి, గ్రిడ్ ఏఈఈ సంపత్, ఏఈఈ సంధ్య, వాటర్ ల్యాబ్ కెమిస్టు వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

• వరిపంటల పరిశీలన

రామగిరి: మండలంలోని కల్వచర్లలో శుక్రవారం వరిపంటను మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, ఏఈవో అరవింద్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్ మండలంలో..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లి, చిన్నరాతుపల్లి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయాధికారులు వరిపంటలను పరిశీలించారు. మాజీ సర్పంచు కొమురయ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

• కాంట్రాక్టు కార్మికుల సంబరాలు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ ప్రకటించడాన్ని హర్షిస్తూ శుక్రవారం స్థానిక ఇల్లెందు క్లబ్ ఏరియాలో పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దీటి బాలరాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ ప్రకటించడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు జనగాం శ్రీనివాస్, ఉల్లంగుల రమేశ్, మోయిన్‌సన్నీ, కృష్ణ పాల్గొన్నారు.

• మిషన్ భగీరథపై సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జూలపల్లి, ఎలిగేడు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం మిషన్ భగీరథ పథకంలో ప్రధాన పాత్ర పోషించే ఫిట్టర్లు, పంప్ ఆపరేటర్లకు జూలపల్లి, ఎలిగేడు మండలాల వారికి 4రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

• ఎంఈవోకు సన్మానం

రామగుండం: అంతర్గాం మండల విద్యాధికారిగా ఏకాంబరం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

• ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

జూలపల్లి: మాల కులబాంధవులు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం 29న నిర్వహించనున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ కనకరాజు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆదివారం ఎన్టీపీసీలోని శ్రీలక్ష్మీనర్సింహ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

• మాలల ఆత్మగౌరవం కోసం ఉద్యమిద్దాం

జ్యోతినగర్: మాలల ఆత్మగౌరవం కోసం అహర్నిశలు ఉద్యమిద్దామని టీఈఎంఏ జిల్లా అధ్యక్షుడు బద్దం డేనియల్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల సమీపంలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నిర్వహించే సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

• టీపీయూఎస్‌తోనే సమస్యలు పరిష్కారం

ఎలిగేడు: టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘంతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీపీయూఎస్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు.

• సొసైటీ అభివృద్ధికి తోడ్పడుదాం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ పీఏసీఎస్ సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

• మారుపేర్ల బాధితుల కోసం పోస్టుకార్డు ఉద్యమం

గోదావరిఖని: మారుపేర్ల బాధితులకు సింగరేణి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఎన్సీపీ ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. స్థానిక సూర్యనగర్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఎన్సీపీ జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పోస్టు చేశారు. ఎన్సీపీ నాయకులు చెన్నూరి నాగరాజు, మొలుగూరి మహేశ్, నాగుల శివకుమార్, సుందిళ్ల సూర్య, కుమ్మరి నాగార్జున, సింగరేణి మారుపేర్ల బాధితులు లక్క శ్రావణ్, పాతపల్లి హరీశ్, దొమ్మేటి రాజు, బొమ్మక కార్తీక్, వేగోళపు సునీల్, పొన్నం వెంకటేశ్, పల్లె సంతోష్, బొమ్మక రాజయ్య, సత్యం పాల్గొన్నారు.

• సహజవనరుల దోపిడీ అరికట్టాలి

రామగిరి: మంథని ప్రాంతానికి సంబంధించిన సహజవనరులు దోపిడీకి గురవుతున్నాయని, వాటిని అరికట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్ డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

• ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలి

సుల్తానాబాద్: ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గ్రామాల్లో మంచినీటిని సరఫరా చేసే గ్రామ సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కోర్నల్ ఉన్నారు.

• రామునిగుండాలలో స్వచ్ఛతాహీ సేవా

రామగుండం: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రామునిగుండాల కొండపై స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల ప్రాంగణం పరిసరాలు శుభ్రం చేశారు.

• దహన సంస్కారాలకు సేవలు అందించాలి

రామగుండం: నగరపాలక సంస్థ పరిధిలో గతంలో దహన సంస్కారం నిమిత్తం మృతుల కుటుంబానికి ఉచితంగా వైకుంఠరథం, దహన సంస్కారాలకు పాడె సామగ్రి, ఇతరత్రా సేవలు ఉచితంగా అందేవి. ప్రస్తుతం ఒక వైకుంఠరథం మినహా ఎలాంటి సేవలు ఉచితంగా అందించడం లేదు. కాగా శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక చొరవ తీసుకొని అమలు చేయాలని ఆయన కోరారు.



పెద్దపల్లిరూరల్: నిట్టూరు గ్రామానికి 12 ఏళ్ల క్రితం మద్య నిషేధ గ్రామంగా గుర్తింపు ఉండేది. కొంతకాలంగా గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు వెలిశాయి. విద్యాలయ ఆవరణను కొందరు మందుబాబులు అపవిత్రం చేస్తున్నారు. ఇటీవల సాక్షిలో ఫొటో కథనం ప్రచురితం కాగా.. ఆవరణను శుభ్రం చేశారు. సోమవారం మళ్లీ ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు, ప్లేట్లు కనిపించాయి.

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 98499 71500

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

ఉద్యోగులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

రామగిరి: సింగరేణి సంస్థ ఉద్యోగులు చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావొద్దని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సెంటనరీకాలనీ ఎంవీటీసీలో శిక్షణ పొందిన 27 మందికి శుక్రవారం జీఎం కార్యాలయంలో కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ స్థాయికి తగ్గటుగా పనిచేస్తూ సూపర్‌వైజర్ల ఆదేశాలు పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, సీనియర్ పీవో పి.రాజేశం, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులతో జీఎం వెంకటేశ్వర్లు

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ వాస్తవ లాభాల్లో సింగరేణి కార్మికులకు 33శాతం వాటా చెల్లించాలని కోరారు. సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలన్నారు. అనంతరం డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు యతిపతి సారంగపాణి, కర్రావుల మహేశ్, సాయవేణి సతీశ్, ఆకుల హరిణ్, సంగాని సాంబయ్య, మేడ రామ్మూర్తి, గంటి నరసింహులు, రాజశేఖర్, పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, పోతరాజు భాస్కర్, తుమ్మ గట్టయ్య, పుప్పాల నాగేంద్రప్రసాద్, నీలం శ్రీనివాస్, పోరండ్ల వెంకటేశం, ఆకుల వీరేశం, మహాత్మ లింగయ్య, జనగాని రవీందర్, సాయి పవన్, బండారి శ్రీనివాస్, గోగుల రవి పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సంస్థకు రావాల్సిన బకాయిలు చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.30వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. ఏరియా వర్క్‌షాప్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నికర లాభాల్లో 33శాతం బకాయిలు చెల్లించాలన్నారు. నికర లాభాన్ని స్థూల లాభంగా ఏఐటీయూసీ నాయకులు చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, విజయ్‌కుమార్, పి.శ్రీనివాస్‌రావు, ఎస్‌కే గౌస్, పెరుమాండ్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రహీంఖాన్, అడిచర్ల మల్లేశం, నంది నారాయణ, సంతోష్‌కుమార్, రవి, బండారి సత్తయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహారావు

ప్రభుత్వస్థలం అన్యాక్రాంతంపై విచారణ

ఓదెల: మండలంలోని జీలకుంటలో ప్రభుత్వస్థలం అన్యాక్రాంతంపై శుక్రవారం గ్రామంలో తహసీల్దార్ యాకయ్య, పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి విచారణ జరిపారు. జీలకుంట మాజీ ఎంపీటీసీ భర్త రౌతు జలపతి ఆధ్వర్యంలో గ్రామస్తులు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావుకు గ్రామంలోని 563/2లోని ప్రభుత్వస్థలం అన్యాక్రాంతంపై ఇటీవల ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశంతో శుక్రవారం తహసీల్దార్ యాకయ్య, ఎస్సై ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద ప్రభుత్వ స్థలం 10గుంటలు ఉండగా అందులో కొంతభాగాన్ని రాజయ్య అనే వ్యక్తి 3గుంటల స్థలం ఆక్రమించుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. అన్యాక్రాంతం అయిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అధికారులకు విన్నవించారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణం చేయొద్దని తహసీల్దార్ సూచించారు. వివాదాస్పద స్థలం వద్ద పోలీసులు పహారా కాయాలని ఎస్సైకి ఆదేశాలు జారీ చేశారు. విచారణలో మాజీ ఎంపీటీసీ భర్త రౌతు జలపతి, ఆయా కులసంఘాల నాయకులు బొంగోని తరుపతిగౌడ్, గోపగాని సతీశ్‌గౌడ్, దార సతీశ్, అగ్గి రాంచంద్రం, బండారి లింగయ్య, సారయ్య, ఆరెల్లి చేరాలు, గందం పైడి పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న తహసీల్దార్, ఎస్సై

కుక్కల దాడిలో దూడ మృతి

రామగిరి: మండలంలోని బుధవారంపేటలో వీధికుక్కల దాడిలో ఓ దూడ మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దేవునూరి సత్యనారాయణ తన ఇంటి వద్ద ఖాళీ స్థలంలో దూడను కట్టేశారు. శుక్రవారం ఉదయం ఇంటి దగ్గర ఉన్న దూడకు మేత వేసి ఇంట్లోకి వచ్చాడు. వీధి కుక్కలన్నీ దాడి చేయడంతో దూడ మృతి చెందింది. గ్రామంలో కుక్కలు, కోతుల బెడదను అధికారులు అరికట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్ డిమాండ్ చేశారు.

పెరటి కోళ్ల పంపిణీ

రామగిరి: కృషివిజ్ఞాన కేంద్రం, రామగిరి ఖిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ద్వారా 1500 కోడిపిల్లలను కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తృత సంచాలకులు విజయ పంపిణీ చేశారు. రత్నాపూర్, రాంపికుంట గ్రామస్తులు వినియోగించుకోవాలన్నారు.